సాక్షి జగిత్యాల

గురువారం । 25 । మే । 2023



బోనమెత్తిన ఊరూవాడ

మల్యాల : మానాలలో కొత్తగా నిర్మించిన పోచమ్మకు గ్రామస్తులు బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



గెలుపు, ఓటములు సహజం

జగిత్యాల: క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని అడిషనల్ కలెక్టర్ మకరంద్ సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41.0/29.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదవుతుంది. పగలు ఎండ తీవ్రత పెరుగుతుంది.

అవినీతి 'ప్లానింగ్'

- పట్టణ ప్రణాళికలో ముడుపుల దందా
- టీఎస్ బీపాస్ దరఖాస్తులకూ లభించని అనుమతులు
- ఇంజినీర్లు, మున్సిపల్ అధికారులు కుమ్మక్కు
- ఫైనలిస్తేనే ఇళ్ల నిర్మాణాలకు ఓకే.. లేదంటే నెలల తరబడి పడిగాపులు
- జగిత్యాల బల్దియాలో అవినీతి బాగోతం



- జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం ఇటీవల టీఎస్ బీపాస్ ద్వారా దరఖాస్తు చేశాడు. దీనితోపాటు అన్ని డాక్యుమెంట్లు అటాచ్ చేశాడు. నిర్దేశిత ఫీజు చెల్లించాడు. 21రోజుల గడువు ముగిసింది. అయినా, ఇంటి నిర్మాణానికి అనుమతి లభించలేదు. ఆ తర్వాత ఓ ఇంజినీర్‌ను సంప్రదించి 'పెద్దమొత్తం'లో సమర్పించగా. అనుమతి లభించినట్లు ఆరోపణలు వచ్చాయి.

జగిత్యాల: మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారుతోంది. ప్రధానంగా పైసలు ఇవ్వనిదే ఇంటి నిర్మాణ అనుమతి లభించడం లేదనే అపవాదు ఎదుర్కొంటోంది. అన్ని డాక్యుమెంట్లు జతచేసి.. టీఎస్ బీపాస్ ద్వారా ఆన్‌లైన్‌లో ఇంటి నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తు చేస్తే.. 21రోజుల్లో గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాల్సి ఉంది. కానీ, గడువు దాటినా అనుమతి రాక, యజమానులు నెలల తరబడి బల్దియా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది.

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు భారం..

- గతంలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకునే యజమానులు.. ఎల్‌ఆర్‌ఎస్ కింద 14 శాతం ఫీజు చెల్లించాల్సి ఉంది.
- దీనికితోడు ఇంటి నిర్మాణ అనుమతి కోసం ఏరియాను బట్టి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఫీజు చెల్లించాల్సి.
- దీనిని సాకుగా చూపుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు.. లే అవుట్లు లేవని, ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించాలని, ఇతరత్రా కారణాలని యజమానుల నుంచి అందినకాడికి వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- నిబంధనల మేరకు 21రోజుల్లో అనుమతి ఇవ్వాలి. కానీ, ఏవేవో కారణాలు చూపుతు కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారు.
- అధికారుల చేతులు తడిపితే మాత్రం అనుమతులు అట్టే వస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి.
- టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఏసీబీ అధికారులు దాడిచేయగా అప్పటి టీపీవో లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.
- పట్టణ ప్రణాళిక విభాగంలో అవినీతికి ఇదొక ఉదాహరణ మాత్రమే.

ఇంజినీర్లు.. అధికారులు కుమ్మక్కు..?

ఇంటి నిర్మాణం కోసం టీఎస్ బీపాస్ ద్వారా ఎక్కడి నుంచైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకోసం ఇంజినీరింగ్ ప్లాన్ జతచేయాలి. ఇక్కడే అసలు కథ మొదలవుతోంది. కొందరు లైసెన్స్‌డ్ ఇంజినీర్లుగా పనిచేసిన వారు అధికారులతో కుమ్మక్కై, తాము సులభంగా ఇంటినిర్మాణ అనుమతులు ఇప్పిస్తామని ఒక్కో ఇంటి నిర్మాణ అనుమతి కోసం సుమారు రూ.70వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. అంతేకాదు.. వారే దరఖాస్తులను నేరుగా టీఎస్ బీపాస్‌లో అప్‌లోడ్ చేసి, అధికారులతో మాట్లాడి అనుమతులు ఇప్పిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. వాస్తవంగా టీఎస్ బీపాస్ వచ్చిన తర్వాత లైసెన్స్‌డ్ ఇంజినీర్లు అవసరం ఉండదు.

ఫోన్లు ఎత్తని అధికారులు..

కొందరు టౌన్ ప్లానింగ్ అధికారులు ఇతర మున్సిపాలిటీల ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇంటి నిర్మాణ అనుమతిలో జాప్యంపై ఫిర్యాదు చేసేందుకు ఫోన్ చేస్తే వారు ఎత్తడంలేదనే విమర్శలు వస్తున్నాయి.

కౌన్సిలర్లతో ఇబ్బందులు

- ఇంటి నిర్మాణ అనుమతి కోసం ఆ వార్డు కౌన్సిలర్‌కు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు చెల్లించాల్సి వస్తోందని పలువురు బాధితులు ఆవేదన చెందుతున్నారు. ఏదోలా ఇచ్చుకున్నా.. మళ్లీ కొంత ఇవ్వాలని కొందరు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. లంచం ఇవ్వకుంటే సెట్‌బ్యాక్ లేదని, రోడ్డు స్థలం ఆక్రమించారనే ఏవేవో కారణాలతో పనులు ఆపేస్తున్నారని యజమానులు అంటున్నారు.

నేరుగా ఫిర్యాదు చేయండి



ఇంటి నిర్మాణదారులు ఇబ్బందులుంటే నేరుగా ఫిర్యాదు చేయండి. నిర్దేశిత పనివేళల్లో కార్యాలయంలోనే అందుబాటులో ఉంటా. టీఎస్ బీపాస్‌లో దరఖాస్తు చేసుకుని, డాక్యుమెంట్లు అన్నీ సక్రమంగా ఉంటే ఇంటి నిర్మాణ అనుమతి ఇవ్వాల్సిందే.

– నరేశ్, మున్సిపల్ కమిషనర్

న్యూస్‌రీల్

నిండుకుండలా పెద్దచెరువు



జలకళ సంతరించుకున్న పెద్దచెరువు

రాయికల్(జగిత్యాల): స్థానిక పెద్దచెరువు ఎండ కాలంలోనూ నిండుకుండలాగా జలకళ సంతరించుకుంది. డీ–52 కాలువ ద్వారా మేడిపల్లి మండలం పోరుమల్ల నుంచి పెద్ద చెరువులోకి నీరు రావడంతో ఎండకాలంలోనూ నీటితో కళకళలాడుతోంది. సుమారు 280 ఎకరాల్లో చెరువు విస్తరించి ఉంది. దీని ఆధారంగా దాదాపు 485 ఎకరాల ఆయకట్టు సస్యశ్యామలమవుతుందని అంచనా.

దుకాణాల్లో తనిఖీలు



తనిఖీ చేస్తున్న అధికారులు

కోరుట్ల: పట్టణంలోని కిరాణాలు, టిఫిన్ సెంటర్లు తదితర దుకాణాల్లో మున్సిపల్ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకొని జరిమానా విధించారు. ప్లాస్టిక్ బ్యాగులు వినియోగించొద్దని, బట్ట సంచులు ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య కళాశాలకు కొత్త డాక్టర్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: స్థానిక వైద్య కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో తరగతుల నిర్వహణకు అనుమతి లభించిందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మరో 42 మంది వైద్యులను నియమిస్తున్నారని, త్వరలో వారు వస్తారని అన్నారు. 100 పడకల నుంచి 300 పడకల జనరల్ ఆస్పత్రి ఏర్పాటు చేసుకున్నామని, ముఖ్యంగా పాథాలజీ, మైక్రో బయోలజీ, కార్డియాలజీ తదితర విభాగాల్లో ఇప్పటికే వైద్య నిపుణులు చేరారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్లు మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కౌలుకు ఆలయ భూములు

జగిత్యాలరూరల్: పొలాస శ్రీపొలాసేశ్వరస్వామి ఆలయ భూములు కౌలుకు ఇచ్చేందుకు వేలం వేయనున్నట్లు ఈవో వేణుగోపాల్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 342 సర్వే నంబరులో 7.18 ఎకరాలు, 359, 368 సర్వే నంబర్లలో 18.32 ఎకరాలను వేలం ద్వారా కౌలుకు ఇస్తామన్నారు. 2023 జూన్ 10 నుంచి 2024 జూన్ 9వ తేదీ వరకు కాలపరిమితితో కౌలుకు అప్పగిస్తామని పేర్కొన్నారు. బహిరంగ వేలంలో పాల్గొనే వారు జూన్ 5న ఉదయం 9గంటలకు ఆలయ ఆవరణలో హాజరు కావాలని సూచించారు. 342 సర్వే నంబరులో కౌలుకు రూ.50 వేల ధరావతు, 359, 368 సర్వే నంబర్లలో రూ.25 వేల ధరావతు సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

బీడీ కార్మికుల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న బీడీ కార్మికులు

కథలాపూర్(వేములవాడ): పీఎఫ్ కార్డు ఉన్న బీడీ కార్మికులు అందరికీ జీవనభృతి అందజేయాలనే డిమాండ్‌తో బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. జీవనభృతి కోసం దరఖాస్తు చేసుకునే వెబ్‌సైట్‌ను వెంటనే అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల సాయం చేయాలని కోరారు. సుమారు 1,000 మంది కార్మికులు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు

- కలెక్టర్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. తన కార్యాలయంలో బుధవారం అధికారులతో వేడుకల నిర్వహణపై సమీక్షించారు. జూన్ 2న ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తామన్నారు. ఉదయం 8 గంటల్లోగా తమ కార్యాలయాల్లో పతాకావిష్కరణ ముగించాలని, ఆ తర్వాత కలెక్టరేట్‌కు తరలి రావాలని అధికారులకు సూచించారు. గ్రామపంచాయతీల్లో సర్పంచులు, మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్లు పతాకావిష్కరణ చేయాలని చెప్పారు. రాష్ట్ర ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు జరిగిన ప్రగతి నివేదికను సందేశం రూపంలో తయారుచేయాలని ఆదేశించారు.

ఘనంగా దశాబ్ది ఉత్సవాలు

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని, అందుకు తగినట్లు ముసాయిదా రూపొందించామని కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. ఇందులో మార్పులు, చేర్పులకు కూడా అవకాశం ఉందన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతు క్లస్టర్లలో రైతులను భాగస్వాములను చేయాలని, ఇందుకోసం చిన్న, పెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేలా రైతు సంఘాల కమిటీలతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. రైతువేదికలను మరమ్మతు చేయాలని, తోరణాలు, లైటింగ్ చేయించాలని ఆదేశించారు. రైతుబీమా లబ్ధిదారులతో మాట్లాడించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు దశాబ్ది ఉత్సవాలు జరుగుతాయని, ప్రతీరోజు ఒక కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్లు లత, మకరంద్, ఎస్పీ భాస్కర్ పాల్గొన్నారు.

వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు

- వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్
- రైతులు, శాస్త్రవేత్తలతో సందడిగా మారిన విత్తన మేళా



విత్తనాలు అందజేస్తున్న డైరెక్టర్ శ్రీనివాస్

జగిత్యాలఅగ్రికల్చర్: మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు పండిస్తేనే రైతులకు మంచి ఆదాయం సమకూరుతుందని వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో బుధవారం విత్తన మేళా నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ, వాతావరణ మార్పులు రైతులకు సవాల్‌గా మారాయన్నారు. వీటిపైనా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నట్లు చెప్పారు. ముందస్తు మార్పులపై రైతులను హెచ్చరించేందుకు మంగళ, శుక్రవారాల్లో ప్రత్యేక బులెటిన్ విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ విత్తన కంపెనీలకు ధబుటుగా పరిశోధన స్థానాల్లో శాస్త్రవేత్తలు తయారు చేసిన విత్తనాలకు మంచి డిమాండ్ ఉందన్నారు. వీటికి పురుగులు, తెగుళ్లను తట్టుకునే లక్షణాలు ఉండటమే కాకుండా మంచి దిగుబడులు ఇస్తున్నాయని వెల్లడించారు. దిక్కు, ముక్కులేని ప్రైవేట్ విత్తనాలను వినియోగిస్తే పెద్దగా ప్రయోజనం ఉండదని చెప్పారు. వరి సాగుకు ముందు జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట పండించాలని సూచించారు. రైతులు స్వయంగా విత్తనోత్పత్తి చేసుకోవడం మేలని పేర్కొన్నారు. వరిలో కలుపు యాజమాన్యంపై శాస్త్రవేత్త శ్రీలత, ఆరుతడి పద్ధతులపై శాస్త్రవేత్త శ్రీనివాస్, వ్యవసాయ యూనివర్సిటీ నుంచి విడుదలైన వరి విత్తన రకాల గురించి శాస్త్రవేత్త ఓంప్రకాశ్, పురుగుల యాజమాన్యంపై శాస్త్రవేత్త బలరాం వివరించారు. రెండేళ్లుగా వరిలో దిగుబడులు ఎందుకు తగ్గుతున్నాయని, సాగు ఖర్చు ఎందుకు పెరుగుతోందని రైతులు శాస్త్రవేత్తలపై ప్రశ్నల వర్షం కురిపించారు. శాస్త్రవేత్తలు రజనీకాంత్, గోన్యా నాయక్, లక్ష్మీప్రసన్న, పద్మజ, రవి, రజనీదేవి, నవత, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు,

మేళాకు స్పందన

విత్తన మేళాకు రైతుల నుంచి మంచి స్పందన వచ్చింది. పొలాస శాస్త్రవేత్తలు తయారు చేసిన జేజీఎల్–24423(జగిత్యాల రైస్–1), జేజీఎల్–28545(జగిత్యాల వరి–2), జేజీఎల్–27356(జగిత్యాల వరి–3) రకాలను విక్రయించగా, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన రైతులు కొనుగోలు చేశారు. దాదాపు 500 మంది రైతులు ఒక్కరోజులోనే సుమారు 290.5 క్వింటాళ్ల వరి విత్తనాలు కొనుగోలు చేశారు. వరి సాగులో ఎదురవుతున్న సమస్యల గురించి శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజల్లో ఆదరణ ఉన్నవారికే టికెట్లు

- నిజామాబాద్ ఎంపీ అర్వింద్



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

మెట్‌పల్లి(కోరుట్ల): ప్రజల్లో ఆదరణ ఉన్న నాయకులకే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్లు కేటాయిస్తామని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ స్పష్టం చేశారు. పట్టణంలోని వాసవీ గార్డెన్‌లో బుధవారం బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఎంపీ మాట్లాడుతూ,నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజ కవర్గాల్లో బీజేపీ బలంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో అన్నిచోట్ల విజయం సాధిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవడం, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికి జూన్ ఒకటి నుంచి నెలపాటు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఫసల్ బీమా యోజనతో రైతులకు ప్రయోజనం కలుగుతోందని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతో దానిని అమలు చేయడం లేదని విమర్శించారు. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ధాన్యంలో కోతలు విధించే రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ, ఇన్‌చార్జి చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్, పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేశ్, నాయకులు సురభి నవీన్‌కుమార్, దొనికెల నవీన్, కస్తూరి సత్యం, చెట్లపల్లి మీనా పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన కార్యదర్శిపై సీరియస్

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇల్లెందుల శ్రీనివాస్‌పై ఎంపీ అర్వింద్ సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. ఇటీవల పట్టణంలో జరిగిన ఓ సంఘ కార్యక్రమంలో శ్రీనివాస్.. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు తనయుడు కల్వకుంట్ల సంజయ్‌ను ప్రశంసలతో ముంచెత్తారు. ఈ వీడియోను ఆ పార్టీకి చెందిన కొందరు ఎంపీకి దృష్టికి తీసుకెళ్లారు. కీలక పదవిలో ఉన్న శ్రీనివాస్ బహిరంగ వేదికపై ప్రత్యర్థి పార్టీకి చెందిన నాయకుడిని పొగడడాన్ని తీవ్రంగా పరిగణించిన ఎంపీ.. ఆయనను పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంచాలని సూచించినట్లు తెలిసింది. దీంతో జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన రాలేదని చర్చ సాగుతోంది. ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కొందరు ఇప్పటికే ఎంపీని కోరినట్లు సమాచారం.

దళితబంధు పేరిట మోసం



లేఖ విడుదల చేస్తున్న నాయకులు

జగిత్యాలరూరల్: దళితబంధు పేరిట సీఎం కేసీఆర్ దళిత సమాజాన్ని మోసం చేస్తున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. దళిత సమాజాన్ని మోసగిస్తున్న తీరుపై ముద్రించిన లేఖను బుధవారం జిల్లా కేంద్రంలో విడుదల చేశారు. ఏఐసీసీ కార్యదర్శి నదీమ్ జావేద్ జగిత్యాలకు రాగా ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ రూపొందించారన్నారు. డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, కార్యదర్శి బండ శంకర్ పాల్గొన్నారు.

కొనుగోళ్లపై దృష్టి సారించాలి

ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం దృష్టి సారించాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జాబితాపూర్ కొనుగోలు కేంద్రంలో ఆయన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు.

డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలి

- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుచరిత
- జగిత్యాల, మెట్‌పల్లి బస్టాండ్‌లలో తనిఖీ



తనిఖీ చేస్తున్న రీజినల్ మేనేజర్ సుచరిత

జగిత్యాల: వేసవి దృష్ట్యా డ్రైవర్లు జాగ్రత్తగా ఉండాలని, ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుచరిత సూచించారు. స్థానిక ఆర్టీసీ డిపో, బస్టాండ్‌ను బుధవారం ఆమె తనిఖీ చేశారు. డ్రైవర్లతో మాట్లాడారు. వాహనం నడిపేటప్పుడే ఏకాగ్రతగా ఉండాలన్నారు. ఎండలు బాగా ఉన్నాయని, జాగ్రత్తలు తీసుకుంటేనే మేలు అని చెప్పారు. ఆర్టీసీని ప్రగతి పథంలో తీసుకెళ్లాలన్నారు. ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని చెప్పారు. జనసంచారం అధికంగా ఉన్న చోట బస్సులు ఆపాలని ఆదేశించారు. అనంతరం బస్టాండ్‌లో దుకాణాలు, మూత్రశాలలు తనిఖీ చేశారు. మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆమె వెంట డీఎం వెంకటనర్సప్ప, కాతరెడ్డి, బీఎల్ నర్సయ్య, శేఖర్ ఉన్నారు.

అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు

మెట్‌పల్లి(కోరుట్ల): సంస్థ అభివృద్ధి కోసం అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుచరిత అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోను బుధవారం ఆర్‌ఎం సందర్శించారు. తొలిసారి వచ్చిన ఆమెకు మేనేజర్ వేదవతితోపాటు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఆ తర్వాత ఆమె మొక్కలు నాటారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులను జ్ఞాపికలు అందించి సత్కరించారు. ఆర్‌ఎం మాట్లాడుతూ డిపోకు లాభాలు సమకూర్చడానికి సిబ్బంది సమష్టిగా కృషి చేయాలన్నారు. అనంతరం బస్‌స్టేషన్‌ను సందర్శించి సిబ్బంది, దుకాణాదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

క్రమబద్ధీకరణపై ఉత్కంఠ

- నాలుగేళ్ల సర్వీసు పూర్తయితేనే రెగ్యులరైజ్
- ఈ ఏడాది ఏప్రిల్ 11 కటాఫ్ తేదీ
- జూనియర్ పంచాయతీ కార్యదర్శుల్లో సంతోషం
- అవుట్ సోర్సింగ్ 'ఉద్యోగుల్లో' ఆందోళన
- విధివిధానాలు రూపొందించిన కమిటీ



సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(ఫైల్)

కథలాపూర్(వేములవాడ)/మల్లాపూర్(కోరుట్ల): గ్రామాల్లో సంక్షేమ పథకాల ఫలాలను అర్హుల దరిచేరుస్తూ, అభివృద్ధి పనుల్లో కీలకపాత్ర పోషిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించడంతో కొందరిలో సంతోషం వ్యక్తమవు తుండగా మరికొందరిలో ఆందోళన నెలకొంది. ఈ ఏడాది ఏప్రిల్ 11వ తేదీ నాటికి నాలుగేళ్ల సర్వీసు కాలం పూర్తిచేసుకున్న వారు అర్హులనే నిబంధన ఇందుకు కారణమవుతోంది.

జిల్లాలో 380 గ్రామపంచాయతీలు..

- జిల్లాలో 20 మండలాలుండగా.. 380 గ్రామపంచాయతీలున్నాయి.
- గ్రామపంచాయతీకొక పంచాయతీ కార్యదర్శి విధులు నిర్వర్తించాల్సి ఉంది.
- జిల్లాలో పంచాయతీ కార్యదర్శులు 90 మంది, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు 206 మంది, అవుట్ సోర్సింగ్ పద్ధతిన నియమించిన పంచాయతీ కార్యదర్శులు 24 మంది ఉన్నారు.
- మూడేళ్ల ప్రొబేషనరీ కాలానికి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్) విధుల్లో చేరారు.
- 2021లో అమలు చేసిన పీఆర్సీ సమయానికి జేపీఎస్‌ల సర్వీస్ రెండేళ్లు పూర్తయింది.
- దీంతో తమకు పీఆర్సీ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.
- అయితే, ప్రభుత్వం ప్రొబేషనరీ కాలాన్ని మూడేళ్ల నుంచి నాలుగేళ్లకు పొడిగించింది.
- నెలవేతనం రూ.15 వేల నుంచి రూ.28,719కు పెంచింది.
- వీరి ప్రొబేషనరీ కాలం గతనెల 11వ తేదీతో ముగియడంతో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సమ్మెకు దిగారు.
- సుమారు 16 రోజులపాటు విధులు బహిష్కరించడంతో ప్రభుత్వం దిగివచ్చింది.
- వారితో చర్చించడంతో సమ్మె విరమించారు.

అవుట్ సోర్సింగ్ కార్యదర్శుల్లో ఉత్కంఠ..

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తామని సీఎం ప్రకటించగా.. వీరి పనితీరును అంచనా వేసేందుకు జిల్లాస్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాస్థాయి కమిటీ పంపిన ప్రతిపాదనలను రాష్ట్రకమిటీ పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తుంది. జిల్లాలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శు(ఓపీఎస్)లు విధులు నిర్వర్తిస్తున్నారు. జేపీఎస్‌లు జిల్లాలో 206 మంది ఉండగా.. ఓపీఎస్‌లు 24 మంది ఉన్నారు. ప్రొబేషనరీ కాలాన్ని పట్టించుకోకుండా జేపీఎస్‌లతోపాటు ఓపీఎస్‌లను క్రమబద్ధీకరిస్తేనే తమకు న్యాయం జరుగుతుందని ఓపీఎస్‌లు అంటున్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి జేపీఎస్‌లతోపాటు తమనూ రెగ్యులరైజ్ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జాప్యం చేయొద్దు



జేపీఎస్‌లను క్రమబద్ధీకరిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడం మాకు సంతోషాన్నిచ్చింది. మా పనితీరును అంచనా వేసే జిల్లా కమిటీ త్వరగా విధివిధానాలు తయారు చేయాలి. జాప్యం చేయకుండా ప్రభుత్వం, ఉన్నతాధికారులు చొరవ చూపాలి. ఓపీఎస్‌లనూ క్రమబద్ధీకరించాలి.

– కొమురయ్య, జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు

అందరినీ రెగ్యులరైజ్ చేయాలి



తక్కువ వేతనం అయినా విధులు నిర్వర్తించాం. ఎండ, వర్షం, రాత్రి, పగలనక కష్టపడి గ్రామాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లాం. ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా మార్చి పనిచేస్తున్న వారందరినీ క్రమబద్ధీకరించండి. ఏళ్లుగా పనిచేస్తున్న జేపీఎస్, ఓపీఎస్‌లకు న్యాయం జరుగుతుంది. ఉద్యోగ భద్రత ఉంటుంది.

– సిద్ధం సతీశ్‌కుమార్, ఓపీఎస్‌ల సంఘం నేత

సర్వీస్‌గా పరిగణించాలి



సీఎం కేసీఆర్ జేపీఎస్‌ల విషయంలో తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమైనది. దీంతో మంచి ఉత్సాహంతో పనిచేసి గ్రామాలను మరింత ప్రగతిపథంలో తీసుకెళ్తాం. తక్కువ వేతనంతో పనిచేసిన నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలాన్ని సర్వీస్‌కాలంగా పరిగణించాలి. సీఎం నిర్ణయాన్ని స్వాగతిస్తాం.

– ఎం.రాజశేఖర్, జేపీఎస్ సంఘం సలహాదారు

క్లుప్తంగా

అండర్-19 క్రికెట్ పోటీలకు ఎంపిక


విశ్వనాథ్

ధర్మపురి : మహారాష్ట్రలో జరిగే అండర్-19 క్రికెట్ పోటీలకు ధర్మపురికి చెందిన యువకుడు ఎంపికయ్యాడు. పట్టణానికి చెందిన పాలెపు మహేశ్, మానస దంపతుల కుమారుడు పాలెపు విశ్వనాథ్. ముంబైలోని భారతీయ విద్యాభవన్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ముంబై చర్చ్‌గేట్‌లోని సునీల్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందాడు. జాతీయ, అంతర్జాతీయ క్రికెట్ పోటీల్లో కనబర్చి అండర్ -19 క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు.

మామిడిపండ్ల కొనుగోలుకు ప్రజల ఆసక్తి


మామిడిపండ్లను విక్రయిస్తున్న బాపురెడ్డి

ధర్మపురి: మండలం కోస్నూర్‌పల్లెకు చెందిన బాపురెడ్డి సుమారు 15 ఎకరాల్లో సేంద్రియ ఎరువులు వాడుతూ మామిడి తోట సాగు చేస్తున్నాడు. ఇటీవల అకాలవర్షాలతో మామిడిపంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. పండించిన మామిడి పండ్లను విక్రయిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ధర్మపురిలోని ఇసుక స్తంభం వద్ద ట్రాక్టర్‌లో మామిడి పండ్లు విక్రయిస్తుండగా కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడు మృతి


క్రాంతి మృతదేహాన్ని తీసుకువస్తున్న స్థానికులు

శంకరపట్నం: మండలంలోని తాడికల్ వాగులో బుధవారం దుస్స క్రాంతి(33) చేపలు పట్టేందుకు వెళ్లి విద్యుత్‌షాక్‌తో మృత్యువాత పడ్డాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని తాడికల్‌కు చెందిన దుస్స క్రాంతి సెల్‌ఫోన్ రిపేర్ చేస్తుంటాడు. గ్రామ సమీపంలోని వాగులో చేపలు పట్టేందుకు వెళ్లి విద్యుత్‌షాక్ పెడుతుండగా ప్రమాదవశాత్తు అతడికి తగిలి విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు. సమీపంలోని రైతులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. స్థానికులు మృతదేహాన్ని వాగులోంచి బయటకు తీశారు. మృతుడికి భార్య సింధు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య పుట్టింటికి వెళ్లడంతో ఫిర్యాదు అందలేదని కేశవపట్నం ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. మృతదేహాన్ని హుజూరాబాద్ మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు.

మున్సిపాలిటీల్లో ‘ఆర్ఆర్ఆర్’

- ప్రతీ వార్డులో కేంద్రాలు
- జూన్ 5వరకు వ్యర్థాల సేకరణ
- పురపాలక శాఖ వినూత్న శ్రీకారం
- ప్రజలనుంచి మంచి స్పందన



రాయికల్‌లో సేకరించిన వస్తువులతో మున్సిపల్ చైర్మన్

రాయికల్: మున్సిపాలిటీల్లో వనరుల పునర్వినియోగానికి శ్రీకారం చుట్టారు. పట్టణాల్లోని వివిధ వార్డుల్లో వ్యర్థాల సేకరణ కార్యక్రమం చేపడుతుండగా జూన్ 5వ తేదీ వరకు కొనసాగనుంది. ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీ యూజ్, రీసైకిల్) పేరిట నూతన ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ప్రతి వార్డులో ఆర్ఆర్ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమ పర్యవేక్షణకు ప్రత్యేక బాధ్యులను నియమించారు.

వివరాల నమోదు

ప్రభుత్వ ఆదేశాల మేరకు 'మేరా లైఫ్ మేరా స్వచ్ఛ షెహర్ పేరిట ఆర్ఆర్ఆర్ కార్యక్రమం అమల్లో భాగంగా పాత సామగ్రిని సేకరిస్తున్నారు. పునర్వినియోగానికి ఉపయోగపడే వ్యర్థాలన్నింటినీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు. వార్డుల్లో నుంచి తెచ్చిన వస్తువులను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలి. ఎవరు ఇచ్చారు..? పేరు, ఇంటి నంబరు, మొబైల్ నంబర్, వస్తువుల పేర్లు రాయాలి. ఆ సామగ్రిని వార్డుల్లో ఎవరికైనా అవసరమైతే ఉచితంగానే ఇవ్వాలి..

ఏయే వస్తువులంటే..

ప్లాస్టిక్, వంట సామగ్రి, వివిధ పుస్తకాలు, పేపర్లు, పాత దుస్తులు, పాదరక్షలు, ఇనుప సామగ్రి, పరుపులు, దిండ్లు, కుర్చీలు, బల్లలు, మంచాలు, పాలిథిన్ వ్యర్థాలను కేంద్రాల్లో సేకరిస్తారు. ఏళ్ల నుంచి ఇళ్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తగ్గించేందుకు పురపాలక శాఖ వినూత్న ప్రక్రియను అమలు చేస్తోంది.

మున్సిపాలిటీ	వార్డులు	జనాభా
జగిత్యాల	48	1,35,000
కోరుట్ల	33	75,363
మెట్‌పల్లి	26	60,240
ధర్మపురి	15	20,300
రాయికల్	12	20,400

వార్డుల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ప్రత్యేక సిబ్బంది అందుబాటులో ఉండి వాటిని సేకరిస్తారు. ఇచ్చిన వస్తువులకు రశీదు అందజేస్తారు.

పేరుకుపోయిన వ్యర్థాలు

మున్సిపాలిటీల్లోని వార్డుల్లో గుట్టలుగా వ్యర్థాలు పేరుకుపోయాయి. వీటి ద్వారా ఇళ్లలో, వార్డుల్లో స్థలం సమస్య నెలకొంటోంది. వ్యర్థాలను తొలగించి ఆధునీకరిస్తే ఆహ్లాద వాతావరణం ఉంటుంది. తాజాగా ఆ దిశగా మున్సిపాలిటీల్లో చర్యలు చేపట్టడంపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. ఇళ్లలో పేరుకుపోయిన పాత సామగ్రిని ఆర్ఆర్ఆర్ కేంద్రాలకు తెచ్చి ఇస్తున్నారు.

ప్రజలు సహకరించాలి



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మున్సిపాలిటీల్లోని ఆర్ఆర్ఆర్ కేంద్రాల్లో వ్యర్థాల సేకరణ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలి. జూన్ 5వ తేదీ తర్వాత నిల్వలను ఆయా సంస్థలకు పునర్వినియోగానికి పంపుతాం.

– గంగుల సంతోష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


క్షతగాత్రుడికి నీరందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

సారంగాపూర్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి గాయపడ్డ ఘటన బుధవారం రాత్రి మండలంలోని పోతారం క్రాస్ రోడ్డు వద్ద చోటు చేసుకుంది. వివరాలోకి వెళ్తే.. బీర్‌పూర్ మండలం కండ్లపల్లిలో జరిగే పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు జగిత్యాల నుంచి సారంగాపూర్, మీదుగా ఎమ్మెల్యే సంజయ్ తన వాహనంలో వెళ్తున్నారు. అదే సమయంలో మండలంలోని పోతారం క్రాస్‌రోడ్డు సమీపంలో బట్టపల్లికి చెందిన ఎల్కోసి రాజేశ్ గాయపడి రోడ్డుపక్కన పడి ఉన్నాడు. వెంటనే ఎమ్మెల్యే వాహనాన్ని ఆపి బాధితుడికి ప్రాథమిక చికిత్స అందించారు. అటుగా వెళ్తున్న ఆటో ఆపి మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, సారంగాపూర్ గ్రామానికి చెందిన రైతుల సహాయంతో జగిత్యాలలోని ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా రాజేశ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

- కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ


వీఓఏలతో మాట్లాడుతున్న కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట : ప్రభుత్వం వీఓఏల సమస్యలను పరిష్కరించాలని కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న వీఓఏలకు బుధవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మహిళా సంఘాలను బలోపేతం చేయడంలో వీఓఏలు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. చాలీచాలని వేతనంతో దుర్భర జీవితం గడుపుతున్నారని, ప్రభుత్వం కనీస వేతనం ।18 వేలకు పెంచడంతో పాటు, బీమా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని ఒకరికి గాయాలు

కథలాపూర్: మండలంలోని దుంపేటలో బుధవారం మధ్యాహ్నం వ్యాన్ ఢీకొని అదే గ్రామంలో నివాసముండే తాపీ మేస్త్రీ బత్తుల బాబురావుకు తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఒంగోలు జిల్లా మచ్చిరాలకు చెందిన బాబురావు కొన్ని నెలలుగా దుంపేటలో ఉంటూ తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. భవనం నిర్మాణం పనులు చేస్తుండగా రుద్రంగి వైపు వెళ్తున్న ఐచర్ వ్యాన్ రోడ్డు పక్కకు దూసుకువచ్చి బాబురావును ఢీకొంది. చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని 108లో కోరుట్ల ఆస్పత్రికి తరలించారు. బాధితుడి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుత్ తీగలు తగిలి లారీ దగ్ధం


దగ్ధమవుతున్న లారీ

గొల్లపల్లి: విద్యుత్ తీగలు తగిలి లారీ దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. మెట్‌పల్లి మండలం ఆరెపల్లి నుంచి గొల్లపల్లి మండలం మల్లన్నపేటకు ఓ రైతు ఎండుగడ్డి తీసుకెళ్తుండగా, గ్రామ శివారులోకి చేరుకోగానే లారీకి విద్యుత్ తీగలు తగిలి షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. స్థానికులు అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించగా వచ్చి మంటలు ఆర్పారు. ఎస్సై దత్తాత్రి, సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

బీమారంలో ఈతచెట్లు..



కథలాపూర్: బీమారం మండలకేంద్రం శివారులో బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఈతచెట్లు కాలిపోయినట్లు గీత కార్మికులు తెలిపారు. 150 కుటుంబాలు వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. సుమారు వెయ్యి ఈతచెట్లు దగ్ధమయ్యాయని, దీంతో తాము ఉపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని గీత కార్మికులు కోరుతున్నారు.

ఒకరిపై కేసు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్ ప్రాంతంలో నివసించే మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన ఇమ్రాన్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సంజీవ్ తెలిపారు. కృష్ణానగర్‌లో నివాసం ఉండే మహిళ మంగళవారం రాత్రి ఇంట్లో ఉండగా అదే ప్రాంతంలో చికెన్ సెంటర్ నిర్వహించే ఇమ్రాన్ ఇంట్లో చొరబడి సదరు మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. సదరు మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై తెలిపారు.

వ్యక్తిపై దాడి


గాయపడిన జాన్

జగిత్యాలక్రైం: మల్యాల మండలం నూకపల్లి గ్రామ శివారులోని అర్బన్ హౌసింగ్ కాలనీలో మంగళవారం రాత్రి జాన్ అనే వ్యక్తిపై ముగ్గురు మహిళలతో పాటు మరికొందరు దాడిచేశారు. వివరాల్లోకి వెళ్తే.. గుంటూరు జిల్లా నర్కల్ మండలం చేజర్ల గ్రామానికి చెందిన జాన్ నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీలో ఉంటూ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి సమీపంలో ఉన్న మహిళతో చిన్నపాటి గొడవ జరుగగా ముగ్గురు మహిళలతో పాటు, కొందరు దాడిచేశారు. చికిత్స నిమిత్తం జాన్‌ను స్థానికులు 108లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

- ఇద్దరిపై కేసు


దాడులు నిర్వహిస్తున్న పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది

సారంగాపూర్: మండలంలోని ధర్మనాయక్‌తండా గ్రామపంచాయతీ పరిధిలో గుడుంబా స్థావరాలపై బుధవారం సారంగాపూర్ ఎస్సై మనోహర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది దాడులు నిర్వహించారు. గ్రామ శివారులోని గుడుంబా స్థావరాలపై దాడులు చేసి 300 లీటర్ల బెల్లంపానకం, తయారీకి వినియోగించే ముడి సరుకు, రెండు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో గుడుంబా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

దాడిచేసిన వ్యక్తులపై కేసు

జగిత్యాల క్రైం : జగిత్యాల పట్టణ శివారులోని టీఆర్‌నగర్ గ్రామానికి చెందిన ఫిరోజ్‌పై దాడిచేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సంజీవ్ తెలిపారు. టీఆర్‌నగర్‌కు చెందిన ఫిరోజ్ మంగళవారం రాత్రి తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అంగడిబజార్ సమీపంలో షాకీర్, సాయి, చోటుతో పాటు మరికొందరు దాడిచేయగా తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


లక్ష్మణ్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట : మండలకేంద్రానికి చెందిన మీస లక్ష్మణ్ (58) రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. లక్ష్మణ్ తన ద్విచక్రవాహనంపై ఈనెల 16న రాగట్లపల్లి వైపు వెళ్తుండగా ఎల్లారెడ్డిపేట వైపు నుంచి వస్తున్న (ఏపీ వి 6139) నెంబర్‌గల డీసీఎం వాహనం అతివేగంతో ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మణ్‌కు గాయాలుకాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అకలికి అలమటించి వృద్ధురాలు..

కోనరావుపేట (వేములవాడ): ఆకలితో అలమటిస్తూ, ఎండదెబ్బకు గురైన ఓ వృద్ధురాలు మూడురోజుల క్రితం మృతిచెందగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని మల్కాపేటకు చెందిన సింగిడి దేవవ్వ (90)కు భర్త, పిల్లలు లేకపోవడంతో కొన్నేళ్లుగా ఒంటరిగా ఉంటోంది. గ్రామంలో భిక్షాటన చేస్తూ జీవనం గడిపేది. మూడు రోజులుగా దేవవ్వ కనిపించకపోయే సరికి బుధవారం గుడిసెలోంచి దుర్వాసన రావడాన్ని స్థానికులు గమనించారు. కాగా అప్పటికే మృతిచెంది ఉంది. నాలుగైదు రోజులుగా నుంచి ఆహారం లభించక మృతిచెందిందా లేదా వడదెబ్బకు గురై మృతిచెంది ఉండవచ్చని గ్రామస్తులు భావిస్తున్నారు. గ్రామస్తులు విరాళాలు పోగు చేసి అంత్యక్రియలు నిర్వహించారు.

టీజీబీలో గొడవ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలకేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు (టీజీబీ) ఉద్యోగి ఖాతాదారుల పట్ల దురుసుగా ప్రవర్తించారు. బుధవారం పావలా వడ్డీ రుణం వాపసు తీసుకునేందుకు మండల కేంద్రానికి చెందిన సద్ద శోభ బ్యాంకుకు వెళ్లింది. అక్కడే ఉన్న సిబ్బందికి విషయం తెలపగా ఇవ్వమని చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం నెలకొంది. అధికారులు మందలించడంతో గొడవ సద్దుమణిగింది. ఖాతాదారు శోభకు పావలా వడ్డీ డబ్బులు వాపసు ఇస్తామని చెప్పడంతో వెనుదిరిగింది.

చివరి గింజవరకూ ధాన్యం కొంటాం

- పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల : చివరి గింజ వరకూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పంట విస్తీర్ణం పెరిగిందన్నారు. రైతుల వద్ద నుంచి చివరి గింజ వరకు మద్దతు ధరపై కొనుగోలు చేస్తుందన్నారు. గత సంవత్సరం 28.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే ఈ సంవత్సరం 38.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. జిల్లాలో రైస్‌మిల్లర్ల వద్ద ధాన్యం దిగుమతికి స్థల సమస్య ఉందని, ఇందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ... జిల్లాలో ధాన్యం దిగుమతి సమస్య రాకుండా అలాట్ చేసిన రైస్‌మిల్లులు తప్పనిసరిగా ధాన్యం దిగుమతి చేసుకునేలా ప్రత్యేకాధికారులను నియమించామన్నారు. రోజూ పర్యవేక్షిస్తున్నామని, ఇబ్బందులు లేకుండా చూస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లత, పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్, డీఆర్డీఏ పీడీ లక్ష్మీనారాయణ, వ్యవసాయాధికారి సురేశ్ పాల్గొన్నారు.

బీరప్ప ఆలయంలో పూజలు


బీరప్ప పట్నం వద్ద జీవన్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్

పెగడపల్లి : మండలంలోని దోమలకుంటలో జరిగిన బీరప్ప పట్నాల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. గ్రామంలో మూడు రోజులుగా బీరప్ప ఉత్సవాలు జరుగుతున్నాయి. బుధవారం ఆలయం వద్ద నాగెల్లి పట్నం వేసి గొల్ల, కుర్మయాదవులు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆలయాన్ని సందర్శించి బీరప్ప పట్నాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వారివెంట ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, మాజీ సర్పంచి బండారి మనెమ్మ, జిల్లా గొర్రె కాపరుల సంఘం నాయకుడు మల్లేశ్‌యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుగౌడ్, ఉపాధ్యక్షుడు బండారి శ్రీనివాస్, నాయకులు మహేందర్ రెడ్డి, విజయభాస్కర్, మల్లేశం, ప్రశాంత్, ప్రవీన్, సతీశ్, రాజేశం ఉన్నారు.

ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం కేటాయించాలి

- సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట రెడ్డి


మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

కోరుట్ల : ఇల్లు లేని ప్రతీ పేద కుటుంబానికి 125 గజాల ఇంటి స్థలం కేటాయించాలని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాడ వెంకట రెడ్డి అన్నారు. పట్టణ శివారులోని సంగెం రోడ్డులో గల జంబి గద్దె ప్రాంతంలో ఇళ్ల స్థలాల ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. 45 రోజులుగా సీపీఎం ఆధ్వర్యంలో చేస్తున్న పోరాటానికి సీపీఐ మద్దతు ఉంటుందన్నారు. ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో చెన్నా విశ్వనాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి వెన్నెం సురేశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు శివనాథ్, సీపీఎం జిల్లా కన్వీనర్ తిరుపతి నాయక్, నాయకులు గుమ్మడి రమేశ్, ఉమా, మొబీనా బేగం, తదితరులు పాల్గొన్నారు.

పది నిమిషాల్లో తిరిగొస్తానని కానరాని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి
- ముగ్గురికి తీవ్రగాయాలు


తిరుపతి మృతదేహం

ధర్మపురి : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ..మండలంలోని రాయపట్నం గ్రామానికి చెందిన బుద్దె తిరుపతి (38) స్నేహితుడు విష్ణుతో కలిసి బుధవారం రాత్రి ద్విచక్రవాహనంపై రాయపట్నం ఎక్స్‌రోడ్డు వరకు వెళ్లొస్తానని ఇంట్లోంచి బయలుదేరాడు. ధర్మపురి నుంచి రాయపట్నం వైపు వెళ్తున్న ఆటో వీరి బైక్‌ను అతివేగంతో ఢీకొంది. ఈ ప్రమాదంలో తిరుపతి అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదంలో విష్ణుతోపాటు ఆటో డ్రైవర్ నేరెళ్ల రాజేందర్, దూడ వెంకటేశ్‌కు గాయాలుకాగా ఆస్పత్రికి తరలించారు. బోల్తాపడిన ఆటోలోని డీజిల్ ట్యాంకు మూత ఊడిపోవడంతో ఆటోకు మంటలంటుకున్నాయి. గ్రామస్తులు మంటలను ఆర్పివేశారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకొని రోదించారు. పది నిమిషాల్లో తిరిగొస్తానని వెళ్లిన భర్త కానరాని లోకానికి వెళ్లాడంటూ భార్య కన్నీటి పర్యంతమైంది. సంఘటన స్థలాన్ని సీఐ కోటేశ్వర్, ఎస్సై కిరణ్‌కుమార్ చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు రిషి, కూతుళ్లు శైనీ, శివాని ఉన్నారు.

లారీల కొరత తీర్చాలి


అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సింగిల్‌విండో, పాలకవర్గం సభ్యులు

చందుర్తి (వేములవాడ) : లారీల కొరతతో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయని, వెంటనే లారీల కొరత తీర్చాలంటూ అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్, జిల్లా సహకార అధికారి బుద్ధ నాయుడుకు చందుర్తి సింగిల్ విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాలకవర్గం బుధవారం వినతిపత్రం అందజేశారు. పది రోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయని, మిల్లుల వద్ద మూడు, నాలుగు రోజులపాటు ధాన్యాన్ని దించుకోవడం లేదన్నారు. వారం రోజులు కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపిస్తే ధాన్యం కొనుగోళ్ల ముగుస్తాయని వారి దృష్టికి తీసుకెళ్లారు. లేకపోతే వర్షాలు పడితే మళ్లీ రైతులకు ఇబ్బందులు తప్పవన్నారు. ఇక్కడ సింగిల్ విండో ఉపాధ్యక్షుడు పుల్క మోహన్, డైరెక్టర్లు చింతపంటి రామస్వామి, శ్రీహరి రెడ్డి, మొగిలి రవి, పులకం లచ్చయ్య, నాగం శ్రీనివాస్, గుడిసె రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లింపులో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న బత్తుల రాంప్రసాద్

సిరిసిల్ల అర్బన్: ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలకు గురైన బాధితులకు నష్ట పరిహారం చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని నేషనల్ అట్రాసిటీస్ ప్రివెన్షన్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. దళితులకు మూడెకరాల భూమి, దళితబంధు ఏమైందని ఎద్దేవా చేశారు. మంత్రి కేటీఆర్ స్పందించి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధితులకు అందాల్సిన రిలీఫ్‌ను అందజేయాలని, లేకపోతే నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నేషనల్ అట్రాసిటీస్ ప్రివెన్షన్ ఫోర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్వాడి సుదర్శన్, సలహాదారులు మహ్మద్ సద్దాం, జిల్లా నాయకులు నరేశ్, బెస్త నరేశ్, నర్సయ్య, ప్రవీణ్, మల్లారపు ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.


రాజన్న సేవలో ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ: రాజన్నను బుధవారం రాత్రి ఎస్పీ అఖిల్ మహాజన్ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎస్పీ కుటుంబ సభ్యులకు ఈవో కృష్ణప్రసాద్, ఆలయ అర్చకులు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎస్పీ రాజన్నకు ప్రత్యేక పూజలు, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకులు వేదోక్త ఆశీర్వచనం గావించారు.